


# జీవితంలో వసంతం

**– శివ**

తెల తెలవారుతోంది.

గౌతమి ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ వైపు పరుగులు తీస్తోంది. అప్పటి వరకు రైలులో వచ్చీరానీ నిద్రతో కునుకు'పాట్లు' పడుతున్న కాశీపతి లేచి కూర్చున్నాడు. వాచి చూసుకున్నాడు. ఆరు కావస్తోంది. గబగబా రైలులోనే కాలకృత్యాలు పూర్తిచేసుకున్నాడు.. కాశీపతి మనసు పరిపరి విధాల పోతోంది. ఆఫీసుకు సంబంధించిన కోర్టు పని నిమిత్తం హైకోర్టుకు వెళుతున్నాడు. కనీసం రెండురోజులైనా హైదరాబాద్‌లో వుండాలి. కాని ఎక్కడ వుండాలో నిర్ణయించుకోలేకపోతున్నాడు. ఉండటానికి చుట్టాలైతే వున్నారు గాని వాళ్ళ ఇళ్ళకు వెళ్ళడం ఇష్టం లేదు. వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు.

కాశీపతి, వెంకటేశ్వరరావు ఇద్దరూ కూడా ఏలూరులో పుట్టి పెరిగారు. ప్రక్కప్రక్క ఇళ్ళవాళ్ళు. మంచి స్నేహితులయ్యారు. ఇద్దరూ డిగ్రీవరకు చదువుకున్నారు. ఏపిపియ్యస్సీ పరీక్ష వ్రాసి కాశీపతి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. వెంకటేశ్వరరావు తెలిసిన వాళ్ళ ద్వారా హైదరాబాద్‌లో ఇ.సి.ఐ.యల్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం కంపెనీకి దగ్గరలో కుషాయిగూడాలో ఒక స్వంత ఇంటిని కట్టుకుని సెటిలయ్యారు వెంకటేశ్వరరావు. వెంకటేశ్వరరావును కలవబోతున్న ఫీలింగ్ కాశీపతిని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గౌతమి ఎక్స్‌ప్రెస్ పరుగు కూడా కాశీపతికి ఎడ్లబండి నడకలా అనిపించి అసహనంగా సీట్లో కదలసాగాడు.

***

కుషాయిగూడలో వెంకటేశ్వరరావు ఇంటి అడ్రస్ వెతికి పట్టుకుని కాలింగ్ బెల్ మ్రోగించాడు కాశీపతి. తలుపు తెరుచుకుంది. ఎదురుగా పదిహేను సంవత్సరాల అమ్మాయి నిలబడింది.

"నాన్నగారు ఉన్నారా అమ్మా" అడిగాడు కాశీపతి.

"ఉన్నారు, లోపలకు రండి" పిలిచింది అమ్మాయి.

వెంకటేశ్వరరావుకు ఇద్దరు పిల్లలు. మొదట అబ్బాయి తరువాత అమ్మాయి. ఈ అమ్మాయే కాబోలు వెంకటేశ్వరరావు కూతురు అనుకున్నాడు కాశీపతి. వేర్వేరు ఉద్యోగాల్లో సెటిలయ్యాక కలిసింది చాలా తక్కువసార్లు.

"ఎవరమ్మా వచ్చింది"అంటూ బయటకు వచ్చాడు వెంకటేశ్వరరావు. కాశీపతి మాట్లాడకుండా వెంకటేశ్వరరావు వైపు చూస్తున్నాడు. వెంకటేశ్వరరావులో చాలా మార్పు వచ్చింది. జుట్టు తగ్గింది. బొజ్జ పెరిగింది. చాలా సహజమైన మార్పు.

"అరె, కాశీపతి, నువ్వా" ఆశ్చర్య ఆనందాలతో పలకరించాడు వెంకటేశ్వరరావు.

"అవున్రా, నేనే, గుర్తుపట్టవనుకున్నాను" అన్నాడు కాశీపతి.

"నిన్నూ, మన స్నేహాన్ని ఎలా మర్చిపోతాన్రా మనిద్దరం కలిసి ఎన్నో సాధిద్దామనుకున్నాం. ఈ ఉద్యోగాలొచ్చి మనల్ని విడదీసాయి కదరా" అంటున్నాడు వెంకటేశ్వరరావు.

తలుపు తీసిన అమ్మాయి కాఫీలతో వచ్చింది.

"కాశీ, ఇది నా కూతురు సరోజ, ఇంటర్ చదువుతోంది" పరిచయం చేయబోయాడు వెంకటేశ్వరరావు.

"నువ్వు ఆగు, క్రొత్త వాళ్ళను పరిచయం చేస్తున్నట్టు చెపుతున్నావు. నాకు తెలియదా, ఈమధ్యకాలంలో రానంత మాత్రాన స్నేహాలు, బంధాలు మర్చిపోతాననుకుంటున్నావా?! ఏమ్మా, నువ్వు చెప్పు, నేను నీకు తెలుసా, తెలియదా?" అడిగాడు కాశీపతి సరోజను.

"తెలుసు అంకుల్, మీరు ఇక్కడకు వచ్చినప్పుడల్లా నన్నూ, అన్నయ్యనూ బయటకు తీసుకెళ్ళి ఐస్‌క్రీంలు ఇప్పించేవారు, ఇంటికి రాగానే నాన్న మమ్మల్ని, మిమ్మల్ని కలిపి తిట్టేవాళ్ళు" నవ్వుతూ అన్నది సరోజ.

"అన్నయ్యగారూ, బాగున్నారా" లోపలి నుండి వస్తూ పలకరించింది వెంకటేశ్వరరావు భార్య పద్మావతి.

"బాగున్నానమ్మా, మా అల్లుడు కిరణ్ ఏడీ కనిపించట్లేదు" అడిగాడు కాశీపతి.

"బి.కాం. పూర్తిచేసాడు, ఈమధ్యనే ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి చేరాడు." అప్పటివరకు ముఖంలో వున్న ఆనందం మాయమై నిరాసక్తంగా జవాబు చెప్పాడు వెంకటేశ్వరరావు.

పద్మావతి, సరోజలు కూడా నెమ్మదిగా లోనికి వెళ్ళిపోయారు.

"ఏమిట్రా అందరూ అదోలా వున్నారు, సంగతి ఏమిటి" అడిగాడు కాశీపతి.

"అల్లుడూ అల్లుడూ అంటూ వెంటేసుకుని తిరిగావు కదరా, అందుకేనేమో మేనమామ పోలిక వచ్చింది" అన్నాడు వెంకటేశ్వరరావు.

ఉలిక్కిపడ్డాడు కాశీపతి. ఇక్కడేదో జరగరానిది జరిగినట్లు, అందుకు తను కారణమైనట్లుగా మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు వంక అర్థంకానట్టుగా చూసాడు కాశీపతి.

"కిరణ్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి కూడా వీడిని ప్రేమించింది. కులాలు వేరైనా పెళ్ళికి అందరం ఒప్పుకున్నాము. తాంబూలాలు కూడా తీసుకున్నాం. ఇంకో రెండు రోజుల్లో పెళ్ళి అనగా రోడ్డుప్రమాదంలో అమ్మాయి చనిపోయింది. ఆ అమ్మాయిను మర్చిపోలేనని, తన మనసులో ఆ అమ్మాయికి తప్ప వేరెవరికి చోటు లేదని, ఇక పెళ్ళిచేసుకోనని నిర్ణయించుకున్నాడు. ఎవరెంత చెప్పినా మారడం లేదు" నిట్టూర్చాడు వెంకటేశ్వరరావు.

వెంకటేశ్వరరావు మాటల్లో ఎంతో ఆవేదన, దిగులు కనిపించాయి కాశీపతికి. మేనమామ పోలిక అని ఇందాక ఎందుకు అన్నాడో అర్థమయ్యేసరికి చురుక్కుమనిపించింది కాశీపతికి.

***

రాత్రి పదయింది. భోజనాలు చేసి వెంకటేశ్వరరావు, కాశీపతి హాల్లో కూర్చున్నాడు. ఇంతలో కిరణ్ లోపలకు వచ్చాడు. ప్రొద్దుననగా వెళ్ళి ఇపుడు వచ్చాడేమో, ముఖం నీరసంగా వుంది. గడ్డం పెరిగి వుంది. అయితే ట్రిమ్ చేసి వుంది. చేతిలో చిన్న కారియర్ వుంది.

కిరణ్ కాశీపతి వంక చూసాడు. కాశీపతిని చూసి చాలా కాలమైందేమో వెంటనే గుర్తుపట్టలేదు. రెండు క్షణాలాగి "మీరు కాశీ అంకుల్ కదూ, ఎపుడు వచ్చారు" ఆనందంగా అడిగాడు కిరణ్. కాశీపతి నవ్వుతూ కిరణ్ వంక చూస్తున్నాడు. కిరణ్ ముఖంలో ఐస్‌క్రీంలకోసం మారాం చేస్తున్న చిన్నప్పటి కిరణ్ కనిపించాడు కాశీపతికి.

"వెళ్ళి స్నానం చేసి, భోజనం చేసిరా" అన్నాడు కాశీపతి.

ఓ ఇరవై నిమిషాల్లో కిరణ్ స్నానంచేసి, భోజనం చేసి వచ్చి కాశీపతి ముందు కూర్చున్నాడు.

"చెప్పండి అంకుల్, ఎపుడు వచ్చారు, ఏమిటి విశేషాలు".



ఇంటి వైద్యం ★ శంఖవటీ రెండు మాత్రలు ఉదయం, సాయంత్రం భోజనం తర్వాత తీసుకుంటే కడుపుబ్బరం తగ్గుతుంది.

"ఆఫీసుకు సంబంధించిన కోర్టు పనిమీద ఇక్కడకు వచ్చాను. పనైపోయింది. రేపు రాత్రికి వెళుతున్నాను. కాబట్టి రేపు నువ్వు ఆఫీసుకు సెలవుపెట్టాలి. మనమిద్దరం సరదాగా బైటకు వెళదాం. బయటే భోజనం చేద్దాం సరేనా" అడిగాడు కాశీపతి.

"తప్పకుండా అంకుల్. మీరిప్పించే ఐస్‌క్రీంలు తిని చాలా కాలమైంది" చిన్న పిల్లాడిలా అడిగాడు కిరణ్.

"మీకు సిటీ అంతా, జూపార్క్, రవీంద్ర భారతి, బిర్లా మందిర్, ప్లానిటోరియం అన్నీ చూపించేస్తాను" హుషారుగా అన్నాడు కిరణ్.

"నువ్వు పుట్టకముందే అవన్నీ చూసేసాను, నాకు చిలుకూరు వెంకటేశ్వర ఆలయం చూపించాలి" అడిగాడు కాశీపతి.

"తప్పకుండా అంకుల్" హుషారుగా అన్నాడు కిరణ్.

***

చిలుకూరు హైదరాబాద్‌కు సుమారు ముప్పై అయిదు కిలోమీటర్ల దూరంలో వుంది. ఓ గంటసేపు ప్రయాణం వుంటుంది. కిరణ్, కాశీపతి చిలుకూరు ఉదయం ఏడు గంటలకల్లా చేరుకున్నారు. అప్పటికే గుడి బయట క్యూలలో ఎక్కువమంది భక్తులు నిలబడి వున్నారు. మైకులలో వినిపిస్తోంది, "ఎవరూ దక్షిణ వేయవద్దని, మొక్కులు తీరిన భక్తులు ప్రదక్షిణాలు చేయడానికి వీలుగా వారికి ఎదురుగా నడవవద్దని".

కిరణ్ వంక చూసాడు కాశీపతి.

"అవును అంకుల్, గుడికి ఆదాయం గుడి మాన్యంమీద వచ్చే పంట డబ్బుతో వస్తుంది. అందువల్ల ఎవరినీ దక్షిణ వేయవద్దని చెపుతున్నారు. లోపలకు వెళ్ళిన తరువాత క్రొత్తగా మొక్కులు మొక్కుకునే వారు మూడు ప్రదక్షిణలు, మొక్కులు తీరినవారు నూట ఎనిమిది ప్రదక్షిణలు చేస్తారు" వివరించాడు కిరణ్.

ఇద్దరూ గుడి ప్రాంగణంలోనికి వెళ్ళారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా వుంది. వారికి అడ్డుగా నడవద్దని, ప్రదక్షిణలు చేసే వారికి సహకరించమని మైకులో చెపుతున్నారు. ప్రక్కగా వెళ్ళి దైవదర్శనం చేసుకుని, ప్రక్కనే వున్న శివుని దర్శనం చేసుకుని అక్కడవున్న ఖాళీ స్థలంలో కూర్చున్నారు.

కాశీపతి కిరణ్ ముఖంలోకి చూస్తూ అడిగాడు. "నీ ప్రేమ వ్యవహారం గురించి నాన్న చెప్పాడు, నువ్వు పెళ్ళికి ఒప్పుకోవట్లేదట."

కిరణ్ ముఖంలో రంగులు మారాయి. ముఖంలో అసహనం చోటుచేసుకుంది. కూర్చున్న చోట నుండి లేవబోతుంటే కాశీపతి చేయి పట్టుకుని కూర్చోబెట్టాడు.

"కిరణ్, చరిత్ర పునరావృతమవుతుందేమోనని, నీ జీవితం కూడా నా జీవితంలా వసంతమనేది లేకుండా ఎడారిలా ఎండిపోతుందేమోనని భయంగా వుంది" అన్నాడు కాశీపతి. కాశీపతి ముఖం పరిశీలిస్తే ముఖంలో పశ్చాత్తాపం కనపడింది.

"అదేమిటి అంకుల్, నాకు అర్థం కాలేదు" అన్నాడు కిరణ్.

"నీ ప్రేమకథలానే నా జీవితంలో కూడా ఓ ప్రేమకథ జరిగింది. అది నా జీవితాన్ని నాశనం చేసింది. వింటావా" అడిగాడు కాశీపతి.

"చెప్పండి అంకుల్" ఆసక్తిగా అడిగాడు కిరణ్.

"మా యింటి ప్రక్క ఇల్లే లతది. లతా, నేను చిన్నప్పటి నుండి కలిసి పెరిగాం, ఆడుకున్నాం, చదువుకున్నాం, ప్రేమించుకున్నాం. ఒకళ్ళను విడిచి ఒకళ్ళం వుండకూడదనుకున్నాం, కలిసి బ్రతకాలనుకున్నాం పెద్దలు మా పెళ్ళికి ఒప్పుకోకపోతే కలిసి చచ్చిపోవాలనుకున్నాం. మా ఆలోచనలు దేవుడికి తెలిసి మా ప్రేమకు పరీక్ష పెట్టదలచుకున్నాడేమో, మా ఇరువైపుల పెద్దలు పెళ్ళికి ఒప్పుకోలేదు. నేను అతికష్టంమీద మా అమ్మా, నాన్నను ఒప్పించాను. కాని లతా వాళ్ళ అమ్మా నాన్న, అన్నయ్య నాకు ఉద్యోగం లేదన్న కారణంగాను, కులాలు వేరన్న కారణంగాను మా పెళ్ళికి ఒప్పుకోలేదు.



లత పెద్దవాళ్ళతో మాట్లాడి ఒప్పించమని అమ్మా, నాన్నను పంపించాను. వాళ్ళు అమ్మా, నాన్నను అవమానించి పంపించారు. ఒకరోజు వాళ్ళ ఇంటికి తాళంవేసి కనిపించింది. ఎక్కడికి వెళ్ళారో ఎవరికీ తెలియలేదు. వారంరోజుల తరువాత వాళ్ళ ఇంటిముందుకు కారు వచ్చి ఆగింది. కారులోనుండి మెడలో దండలతో లత, ఇంకొక వ్యక్తి దిగారు.

లత పెద్దవాళ్ళతో మాట్లాడి ఒప్పించమని అమ్మా నాన్నను పంపించాను. వాళ్ళు అమ్మా, నాన్నను అవమానించి పంపించారు. ఒకరోజు వాళ్ళ ఇంటికి తాళంవేసి కనిపించింది. ఎక్కడికి వెళ్ళారో ఎవరికీ తెలియలేదు. వారంరోజుల తరువాత వాళ్ళ ఇంటిముందుకు కారు వచ్చి ఆగింది. కారులోనుండి మెడలో దండలతో లత, ఇంకొక వ్యక్తి దిగారు. వెనుకనే వాళ్ళ అమ్మా, నాన్న దిగారు. లతకు పెళ్ళిచేసేసారని అర్థమయింది. నా కాళ్ళ క్రింద భూమి బద్దలై నేను అందులో కూరుకుపోతున్నట్టు అనిపించింది. లత ఒకసారి నావంక చూసి లోపలికి వెళ్ళిపోయింది. ఆమె ముఖంలో నాకు ఏ భావం కనిపించలేదు. ఆమెను కలసి మాట్లాడాలని నేను చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. వాళ్ళ ఇంటికి ఫోన్ చేయబోతే వేరెవరో లైనులోకి వస్తున్నారు కాని లత రావడం లేదు. అదే రోజు సాయంత్రం లత, భర్తతో వలసి అత్తవారింటికి వెళ్ళిపోయింది" ఊపిరి పీల్చుకోవడానికి అన్నట్టు ఆగాడు కాశీపతి.

కిరణ్ టెన్షన్‌గా అడిగాడు "చెప్పు అంకుల్".

"లతకు పెళ్ళయిపోగానే నన్ను కూడా వెంటనే పెళ్ళి చేసుకొమ్మని అమ్మా, నాన్న బలవంతం చేయసాగారు. కాని, నాకు నమ్మకం వుంది, లతకు ఈ పెళ్ళి బలవంతంగా చేసి వుంటారని, లత మనసులో నన్ను వుంచుకుని భర్తతో కాపురం చేయలేక, భర్తను వదిలేసి నా కోసం ఖచ్చితంగా వచ్చేస్తుందని పిచ్చిగా నమ్మాను. కాలగర్భంలో సంవత్సరం గడిచిపోయింది. ఈ సంవత్సర కాలంలో నేను వేరే వూర్లో ఒంటరిగా వుండేవాణ్ణి. అపుడపుడు ఇంటికి వచ్చినా లత విషయాలు ఏమీ తెలిసేవి కావు. ఒకసారి నేను సెలవులని ఇంటికి వచ్చాను. అపుడు కనిపించింది లత చేతిలో చంటి పాపతో. లత తల్లయిందని అర్థమైంది. అయినాసరే బిడ్డతో సహా లతను ఆదరించమని నా మనసు నాకు చెప్తోంది. ఎవరూ లేకుండా చూసి ఎలాగైతేనేమి లతతో మాట్లాడగలిగాను. నా మనసులో మాట చెప్పాను పెళ్ళిచేసుకోవడానికి సిద్ధమన్నాను, భర్తను వదలి వచ్చేయమన్నాను.

నన్ను ప్రేమించింది నిజమైనా, వాళ్ళ అమ్మా, నాన్నల ఒత్తిడికి తలొగ్గి వేరొక వ్యక్తిని పెళ్ళిచేసుకున్నానని, అతడే దేవుడంది. ఇపుడు తన మనసులో అతను తప్ప నేను లేనంది. ఇంకెప్పుడు తన గురించి ఆలోచించకుండా వేరొక అమ్మాయిని చూసి పెళ్ళిచేసుకొమ్మంది. నేను హతాశుడినయ్యాను. మళ్ళీ ఆలోచించమని పిచ్చివాడిలా, బిచ్చగాడిలా అడిగాను. నన్ను జాలిగా చూసి నవ్వి వెళ్ళిపోయింది. నా మనసు ముక్కలైంది, ఆడవాళ్ళను నమ్మకూడదనుకున్నాను. పెళ్ళిచేసుకోకుండా బ్రహ్మచారిగా వుండిపోవాలనుకున్నాను. అమ్మానాన్న ఎంత ప్రాధేయపడ్డా నేను పెళ్ళిచేసుకోలేదు. ఇరవై సంవత్సరాలు గడచిపోయాయి. అమ్మానాన్న చనిపోయారు. తమ్ముడికి, చెల్లికి పెళ్ళిళ్ళు చేసాను. తమ్ముడి పిల్లలతోను, చెల్లి పిల్లలతోను ఆనందిస్తున్నాను. లత ఇద్దరు పిల్లలతో ఆనందంగా బ్రతుకుతోంది. నేను ఒంటరిగా వుండిపోయాను. మొదట్లో ప్రేమకోసం ఒంటరిగా బ్రతుకుతున్న గొప్ప ప్రేమికుడినని గర్వంగా ఫీలయ్యేవాడిని. కాని ఈ రోజున ఆలోచిస్తుంటే నేను చేసింది ఎంత తప్పో, ఎంత పిచ్చిపనో అర్థమవుతుంది. నా జీవితాన్నే నష్టపోయాను. నాకోసం లత వచ్చేసి వుంటే నేను ఎవరినైనా ఎదిరించి వుండేవాడిని. కాని నన్ను కాదని వెళ్ళిపోయిన లతకోసం త్యాగం పేరుతో జీవితాన్నే పాడుచేసుకొన్నాను. జ్వరం వస్తే మందులిచ్చే దిక్కులేదు. ఇంటికి వస్తే అన్నం పెట్టే దిక్కులేదు. నాదీ ఒక బ్రతుకేనా.

కిరణ్, అందుకే ఆలోచించు, నాలా నీ జీవితాన్ని పిచ్చి ఆలోచనలతో పాడుచేసుకోకు. దురదృష్టవశాత్తు నీ ప్రియురాలు చనిపోయింది. అంతటితో నీ జీవితం అయిపోయిందనుకుంటే ఎలా, దేవుడు సృష్టించిన మనిషికైనా, మ్రానుకైనా ఒక పరమార్థం నిర్దేశించబడింది. ఆ పరమార్థాన్ని మనం గ్రహించాలి. చెట్లు ఆకులు రాలుస్తాయి, తిరిగి చిగురిస్తాయి. తిరిగి చిగురించటమే వాటి పరమార్థం. మానవుడు బాల్యం, యౌవనం, గృహస్థుడు, వృద్ధాప్యం ఈ ధర్మాలన్నిటిని విధిగా అనుభవించాలి భగవంతుడు తీసుకుంటే తప్ప ఏ దశనూ కాదనే హక్కు మనకు లేదు.

కాబట్టి కిరణ్, పెళ్ళిచేసుకో, నీ జీవితాన్ని సార్థకం చేసుకో, అమ్మా నాన్నను సంతోషపెట్టు. కాశీపతి ముఖంలో పశ్చాత్తాపాన్ని గమనించాడు కిరణ్.

ఆరోజు రాత్రే కాశీపతి వెళ్ళిపోయాడు.

***

పది రోజుల తరువాత కాశీపతికి వెంకటేశ్వరరావు దగ్గరనుండి లెటరు వచ్చింది కిరణ్ పెళ్ళికి ఒప్పుకున్నాడని. కాశీపతి మనసు తేలిక పడింది. చిలుకూరు వెళ్ళడానికి తేది నిర్ణయించుకోవడంకోసం కేలండర్ తీసాడు కాశీపతి. ★



ఇంటి వైద్యం

★ హింగు (ఇంగువ) 1-2 గ్రాములను అన్నంలో కలిపి సేవిస్తే అజీర్ణం కడుపుబ్బరం తగ్గి ఆహారమునందు ఆసక్తి కలుగుతుంది.